క్లుప్తంగా

జీలుగతో జింకు ధాతులోపం నివారణ



జీలుగను పరిశీలిస్తున్న ఏఓ మధు మోహన్

ఆకివీడు: వరి చేలల్లో జింకు ధాతులోపం, చౌడు నివారణ వంటి వాటితో పాటు, నేలల్లో పోషకాల సమతుల్యం చేయడానికి పచ్చిరొట్ట, నవధాన్యాల సాగు తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి మధు మోహన్ సూచించారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు సాగు చేసిన నవధాన్యాలు, జీలుగ పచ్చిరొట్ట సాగును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రసాయినక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించేందుకు పచ్చిరొట్ట సాగు మంచి ఫలితాల్ని ఇస్తుందన్నారు. ఆయన వెంట గ్రామ వ్యవసాయ సహాయకురాలు లావణ్య ఉన్నారు.

ఆక్వా రైతులు సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ భారతి

వీరవాసరం: చేపలు, రొయ్యల రైతులు ఆక్వా శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను పాటించి అభివృద్ధి దిశలో సాగాలని రాయకుదు గ్రామ సర్పంచ్ గెద్దం భారతి తెలిపారు. రాయకుదురు గ్రామ సచివాలయం కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఆక్వా రైతుల ప్రత్యేక అవగాహన సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. కొణితివాడ, మడుగు పోలవరం గ్రామాల్లో ఆక్వా సదస్సులు నిర్వహించారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అద్దాల శ్రీరామచంద్ర మూర్తి, వీఎఫ్ఎ వెంకటేష్, కదలి నెహ్రూ, గెద్దం భాస్కరరావు, ఆక్వా సిబ్బంది పలువురు రైతులు పాల్గొన్నారు.

త్యాగరాజు మ్యూజిక్ అకాడమీ గౌరవాధ్యక్షుడిగా విశ్వేశ్వరరావు



విశ్వేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని త్యాగరాజు మ్యూజిక్ అకాడమీ గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ గంధం వెంకట విశ్వేశ్వరరావును ఏకగ్రీవంగా నియమించినట్లు త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షుడు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు చెప్పారు. విశ్వేశ్వరరావును నియమించిన సందర్భంగా ఆర్యవైశ్య యువజన సంఘ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమంలో వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కనుమూరి సత్యనారాయణరాజు, గన్నాబత్తుల శ్రీనివాస్, కారుమూరి సూర్యప్రకాశరావు, మంతెన రామచంద్ర రాజు, వబిలిశెట్టి శ్రీ వెంకటేశ్వర్లు, కారుమూరి ఆదిత్య, కురిశేటి లక్ష్మి, పెద్దాడ శాంత కుమారి పాల్గొన్నారు.

వైభవంగా విష్ణు సహస్రనామ పారాయణం



విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తున్న మహిళలు

ఆకివీడు: స్థానిక మదన గోపాల స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి గీతా మహిళా మండలి అధ్యక్షురాలు కె.రాజ్యలక్ష్మి అక్కయ్య ఆధ్వర్యంలో కోటి విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విష్ణు సహస్ర నామంలో ఎంతో శక్తి ఉందన్నారు. 2010 నుండి మదన గోపాల స్వామి ఆలయం వద్ద గీతా మహిళా మండలి కోటి విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తున్నారని వివరించారు.

కలెక్టర్ చర్యలు అభినందనీయం

భీమవరం: ప్రమాదంలో మృతి చెందిన ఉపాధి కూలీల పోస్టు మార్టానికి సొమ్ములు వసూలు చేసిన వారిపై కలెక్టర్ సి నాగరాణి తీసుకొన్న చర్యలను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఏప్రిల్ 16వ తేదిన మొగల్తూరులో ఉపాధి పని చేస్తున్న కూలీలపై వ్యాన్ దూసుకువెళ్లి చనిపోయిన బాధలో ఉన్న కుటుంబాల నుంచి పోస్టుమార్టం నిమిత్తం సొమ్ములు వసూలు చేయడం దుర్మార్గమని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. నాటి సంఘటనను ప్రత్యేక ప్రమాదంగా గుర్తించి ఎక్స్ గ్రేషియో మృతుల కుటుంబాలకు అందజేయాలని కోరిన ప్పటికీ ప్రభుత్వం నేటికీ స్పందించక పోవడం దారుణమన్నారు. పోస్టుమార్టం కోసం అక్రమంగా సొమ్ములు వసూలు చేసినవారిపై చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం

- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు



గొల్లవానితిప్పలో బురమయంగా ఉన్న రోడ్డు

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో సమస్యలు తిష్ఠ వేయడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 12 వేల మంది జనాభా కలిగిన గ్రామంలో ఇటీవల వర్షాలు పడటంతో డ్రెయినేజీ వ్యవస్థ స్తంభించిపోవడంతో మురుగు నీరు ఎక్కడిక్కడే నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు దుర్వాసనతో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. దోమలు ప్రబలడంతో సాయంత్రమైతే కంటిమీద కునుకు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమవ్వడంతో సీజనల్ వ్యాధులైన మలేరియా, చికెన్ గున్యా, తదితర వ్యాధులు ప్రబలు తాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాల వల్ల జలుబు, వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.

అడుగంటిన రక్షిత మంచినీటి చెరువు

గ్రామంలో రక్షిత మంచినీటి చెరువు అడుగంటడంతో రోజుకు ఒక్క పూట మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నారని అవి కూడా బురదగా వస్తున్నాయని తాగడానికి పనికి రావడం లేదంటున్నారు. 20 లీటర్ల మినరల్ వాటర్ టిన్నును రూ. 30 కొనుగోలు చేసి తాగుతున్నామని ప్రతి రోజు నీళ్ల కొనుక్కుని తాగాలంటే మా ఆర్థిక పరిస్థితి దిగజారిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



డ్రెయినేజీలో పేరుకుపోయిన సిల్టు



అడుగంటిన రక్షిత నీటి చెరువు

ఎక్కడిబడితే అక్కడ చెత్త

గ్రామంలో ఇళ్లలో వృథాగా వచ్చే చెత్తను ఒక చోట వేయకుండా ఎక్కడిబడితే అక్కడ వేయడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. పంట కాలువలు సమీపంలో వేస్తుడంతో దుర్వాసనతో ఆ ప్రాంత నివాసితులు ఉండలేకపోతున్నామని చెబుతున్నారు.

రోడ్లపై ఆవుల స్వైర విహారం

రోడ్లపై ఆవులు స్వైర విహారం చేయడంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్లపై మందలుగా ఆవులు పడుకోవడమే కాకుండా దాడి చేస్తున్నాయని గ్రామస్తులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు తెరవడంతో విద్యార్థులను బయటకు పంపాలంటే భయమేస్తుందని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు గాని, పాలక వర్గ సిబ్బంది కాని సమస్యలను పట్టించుకోవడం లేదని వారి తీరుపై మండి పడుతున్నారు. ఇప్పటికైనా గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

చెరుకుమిల్లిలో నట్టల నివారణ మందుల పంపిణీ

ఆకివీడు: నట్టల నివారణ వారోత్సవాల్ని ప్రారంభించినట్లు మండల పశుసంవర్ధక శాఖ అధికారిణి డాక్టర్ కెల్లా భార్గవీ సత్య చెప్పారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో శుక్రవారం మేకలకు నట్టల నివారణమందు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేకులు, గొర్రెల్లో పరాన్నజీవుల నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో 150 గొర్రెలు, 100 మేకలకు మందులు వేసినట్లు వివరించారు. కుప్పనపూడి గ్రామంలో శనివారం నట్టల మందు వేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏహెచ్ఏ మంజూష పాల్గొన్నారు.

మాజీ సైనికుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం: మండల న్యాయ సేవా సంస్థలో పారా లీగల్ వలంటీర్స్‌గా సేవా దృక్పథంతో పనిచేయాలనే ఆసక్తి గల మాజీ సైనికుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు న్యాయ సేవా సంస్థ చైర్మన్, మూడవ అదనపు జిల్లా జడ్జి బి లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పారా లీగల్ వాలంటీర్స్‌గా పనిచేయాలనే ఆసక్తి గల మాజీ సైనికులు డీఎన్నార్ కళాశాల రోడ్డులో ఉన్న కోర్టు భవనంలోని సంస్థ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించి దరఖాస్తును అందజేయాలన్నారు. సంస్థ ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో పాల్గొని పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆశక్తిగలవారు ఫోన్ 08816 231133, 99496 14419 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

సీతారామరాజు మెమోరియల్ హాల్ నిర్మాణం చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న వాసుదేవరావు

భీమవరం: భీమవరం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ నిర్మాణం చేయాలని నిర్మాణ సాధన కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం నిర్మాణ సాధన కమిటీ సభ్యుల సమావేశంలో బి వాసుదేవరావు మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో భీమవరం మున్సిపల్ చైర్మన్ కొటికలపూడి గోవిందరావు అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్‌ను జి ప్లస్‌త్రీ నిర్మాణం పేరుతో పాతభవనాన్ని తొలగించారని ఇంతవరకు నిర్మాణం చేయలేదని విమర్శించారు. అల్లూరి సీతారామరాజు పట్ల పాలకవర్గాలు చిన్నచూపు చూడడం దారుణమని, స్వాతంత్ర పోరాటానికి స్ఫూర్తినిచ్చిన అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ నిర్మాణం ఇంతవరకు నిర్మాణం చేపట్టకపోవడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. భవన నిర్మాణం చేపట్టాలని జూలై 4న అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నిరసన దీక్ష చేపడుతున్నట్లు వాసుదేవ రావు తెలిపారు. ఈ నెల 30న హాల్ నిర్మాణం కోరుతూ యుటిఎఫ్ ఆఫీసులో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని ఈ సమావేశానికి స్వచ్ఛంద సంస్థలు మేధావులు, అన్నివర్గాల ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎం వైకుంఠరావు, బి సత్యనారాయణ, సీహెచ్ వెంకటేశ్వరరావు, డి త్రిమూర్తులు, డి నాగేశ్వరరావు, బి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేంద్ర జెడ్పీ పాఠశాల సందర్శన



వేంద్ర హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడతున్న సమగ్ర శిక్షణ అధికారి పి.శ్యాంసుందర్

పాలకోడేరు: పాఠశాల ఎన్రోల్మెంట్‌లో భాగంగా వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్షణ ప్రాజెక్టు అధికారి పి.శ్యాంసుందర్ శుక్రవారం పాఠశాలను సందర్శించి పాఠశాలలో ముగ్గురు విద్యార్థులను ఎన్రోల్ చేశారు. అనంతరం హెచ్ఎం జీవీవీ శ్రీనివాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అసమానతలను విద్య ద్వారా మాత్రమే తొలగించవచ్చన్నారు. ఈ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో సీఎంఓ చంద్రశేఖర్, ఏఎంఓ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ శివన్నారాయణ, ఉపాధ్యాయులు పంపన సాయిబాబు, ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

కౌలు కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ



కలసిపూడిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉండి: కౌలురైతు కార్డుల కోసం కౌలు రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వీఏఏ లేదా వీఆర్వోలను సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. కౌలురైతు కార్డుల మంజూరు కోసం శుక్రవారం కలసిపూడి, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాల్లో ఏఓ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించే కార్యక్రమాన్ని తహసీల్దార్‌తో పాటు తాను కూడా రెండు బృందాలుగా ఏర్పడి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాబట్టి కౌలు రైతులు గమనించి తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మంతెన చంటిరాజు, ఎంపీటీసీ సభ్యులు దంగేటి రామలింగేశ్వరరావు, మున్నలూరి సువర్ణలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన



అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం, టూ టౌన్ లోని, 36 వ వార్డు, రామరాజు తోటలో మావుళ్లమ్మ(చిన మావుళ్ళమ్మ)అమ్మవారి 40వ జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మావూరి వెంకట పద్మరాజు (అమ్మ సిల్క్స్) ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి గౌరవ అధ్యక్షుడు పంజా లక్ష్మణరావు, ఆర్.ఆర్. ఫౌండేషన్ కన్వీనర్ రామాయణం సుధీర్, మావూరి సుందరరావు, పళ్ళ ఏసుబాబు, కోరసిక వెంకటేశ్వరరావు, గ్రంధి బాలాజీ, కొండేపూడి గణపతి, అమృతలూరి భాస్కరరావు, మొదలవలస నాగేశ్వరరావు, పచ్చిగోళ్ళ సురేష్ యాదవ్, అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



భీమవరంలో సీపీఎం సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్

భీమవరం: లేబర్ కోడ్లు రద్దు, కార్మిక సమస్యల పరిష్కారం కోసం జూలై 9వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్‌వీగోపాలన్ తెలిపారు. శుక్రవారం భీమవరం పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో బి వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో గోపాలన్ మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూల విధానాలను అమలు చేస్తుందని పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చారని విమర్శించారు. ఎంతో కష్టపడి దేశ ఆదాయం, అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రమంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. విశాఖ స్టీల్, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని గోపాలన్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గొర్ల రామకృష్ణ, దూసి కళ్యాణి, ధనికొండ శ్రీనివాస్, సూర్నీడి వెంకటేశ్వరరావు, మామిడి శెట్టి రామాంజనేయులు, కానేటి బాలరాజు, జుత్తిగ నర్సింహామూర్తి, కె. రాజా రామ్మోహన్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ అందజేత

ఆకివీడు: రేషన్ బియ్యం షాపులకు వచ్చి తీసుకువెళ్లలేని వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ అందజేస్తున్నట్లు రెవిన్యూ ఇన్స్పెక్టర్ వంటపాటి ఆంజనేయులు చెప్పారు. పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా వార్డులకు వెళ్లి వృద్ధులను, దివ్యాంగులను, నడవలేని వాళ్లను గుర్తించి రేషన్ అందజేస్తున్నామన్నారు. అయితే పలు రేషన్ షాపుల్లో ఈ నెల 10వ తేదీ నాటికే రేషన్ బియ్యం ఖాళీ అయిపోయాయని షాపులు మూత వేశారని పలువురు వాపోయారు. షాపుల వద్ద సరుకు నిల్వలు, వినియోగంపై బోర్డు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన



ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశమైన అంగన్వాడీ కార్యకర్తలు

కాళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు ।మానవ అక్రమ రవాణా॰ పై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకివీడు ఐసీడీఎస్ సీడీపీఓ వాణివిజయరత్నం మాట్లాడుతూ మానవ అక్రమరవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా ఉందన్నారు. ఉద్యోగం, సినిమా అవకాశాల పేరుతో ముఖ్యంగా మహిళలను మోసగిస్తున్నారని వివరించారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ కిశోర వికాసం పథకాన్ని ఉపయోగించికొని తమ పరిధిలో ఉన్న కిశోర బాలికలకు అవగాహన కల్పించి రక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తులసి, గ్రీష్మకుమారి, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అనిల్ కుమార్, మిథాలిరాజు పాల్గొన్నారు.

బొండాడ కాలువ నీరు కలుషితం

కాలవ గట్టునే చెరువు గట్టుగా మలిచిన వైనం



బొండాడలో పంట కాలువ గట్టే చెరువుగట్టుగా ఉన్న దృశ్యం

కాళ్ల: మండలంలోని సుమారు 10 శివారు గ్రామాలకు తాగు, సాగునీరు అందించే బొండాడ పంటకాలవ కలుషితమైంది. మండలం పరిధిలో జక్కరం నుంచి మాలవానితిప్ప శివారు గోగుతిప్ప వెళ్లే సరికి గట్లు కుచించుకుపోయి ఇది కాలువా ? లేక పంట బోదేనా ? అనే విధంగా తయారైంది. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో గతంలో ఈ పంట కాలువను చేర్చి చేపల చెరువులు తవ్వారు. అయితే కాలువ గట్టునే చెరువు గట్టుగా చేసుకుని రైతులు సాగు చేస్తున్నారు. వీటిని చూస్తే ఏది కాలువ గట్టు.. ఏది చెరువు గట్టో అర్థం కాదు. అప్పట్లో నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువులు తవ్వుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. అంతేగాక కాలువను ఆనుకుని పలుచోట్ల ఇళ్లు, పెద్ద షెడ్డులు నిర్మించారు. దీంతో కాలువ పక్కన నివసించేవారు తమ ఇళ్లలోని చెత్తను సరాసరి కాలువలో వేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆక్వా చెరువుల నీరు కాలువలోకి..

ఆక్వా చెరువుల నీటిని నేరుగా కాలువలోకి వదిలేస్తున్నారు. కొన్ని గ్రామాల్లోని మురుగునీరు నేరుగా ఈ పంట కాలువలో కలుస్తుంది. దీని వల్ల శివారు గ్రామాలకు తాగునీరుగా ఈ కాలువ నీరు ఉపయోగపడడం లేదు. ఆక్వా చెరువులు, చెత్త తదితరాలు కాలువలోకి వదలడమే ఇందుకు ప్రధాన కారణమని శివారు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. తూడు గుర్రపు డెక్కమేట వేయటంతో నీటిపారుదల ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని శివారు గ్రామ ప్రజలు కోరుతున్నారు. కాలువలో చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా కాలువ గట్టునున్న ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.



పంట కాలువ గట్టు ను అనుకుని వేస్తున్న చెత్త



బొండాడ పంట కాలువలు మేట వేసిన గుర్రపు డెక్క

మూలకు చేరిన పశు సంచార వ్యాన్



ఏఎంసీ యార్డులో నిరుపయోగంగా ఉన్న యలమంచిలి వెటర్నరీ వ్యాన్

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర పశు సంవర్ధకశాఖ సంచార పశు ఆరోగ్యసేవ పేరుతో మొబైల్ వెటర్నరీ వ్యాన్‌లను ఏర్పాటు చేశారు. ఇవి నియోజకవర్గానికి రెండు వ్యాన్‌లను కేటాయించారు. ఈ మొబైల్ వెటర్నరీ వ్యాన్‌లు నియోజకవర్గంలో పశు వైద్యులు అందుబాటులో లేని ప్రాంతాల్లో అలాగే పశు వైద్యశాలలు లేని ప్రాంతాలకు అత్యవసర సమయాల్లో వెళ్లి పశువులకు వైద్య సేవలందించి వస్తుంటారు. 1962కు కాల్ చేస్తే వెంటనే స్పందించి మొబైల్ వ్యాన్‌ల ద్వారా అక్కడకు వెళ్లిని సిబ్బంది పశువులకు చికిత్స చేసి వస్తుంటారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పశువులకు వ్యాధుల సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి సమయంలో అందుబాటులో ఉండాల్సిన పశు సంచార మొబైల్ వ్యాన్‌లు వివిధ మరమ్మతులతో మొరాయిస్తున్నాయి. నియోజకవర్గంలో యలమంచిలి మండలానికి చెందిన పశు సంచార మొబైల్ వ్యాన్ గత వారం రోజులు నుంచి గేర్‌బాక్స్ మరమ్మతులు రావడంతో పట్టణంలో అగ్రికల్చరల్ మార్కెట్ యార్డులో పార్కింగ్ చేసి ఉంచారు. ఈ వ్యాన్‌లో ఉన్న హైడ్రాలిక్ లిఫ్ట్ ద్వారా పశువులను వ్యాన్‌ల్లోకి ఎక్కిస్తారు. కానీ ఈ హైడ్రాలిక్ పనిచేయకపోవడంతో వ్యాన్‌లు ఉన్నా ఉపయోగం లేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతంలో ఈ వ్యాన్‌లు మరమ్మతులు వచ్చినప్పుడు జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ కంపెనీ చేసేది. వాళ్ల టెండర్ రద్దు కావడంతో ప్రస్తుతం భవ్య హెల్త్ సర్వీసెస్ సంస్థ మరమ్మతులు చేస్తున్నాయి. మరమ్మతులు వేగంగా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని పాడి రైతులు కోరుతున్నారు.

సంపద సృష్టి ఏమైంది చంద్రబాబు?



కార్మికులకు మద్దతు తెలుపుతున్న చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

నరసాపురం: అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తానని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గొప్పగా చెప్పి, ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చారని నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అన్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చి మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని ఆమె డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 5 రోజులుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికుల రిలే దీక్షా శిబిరాన్ని గురువారం చైర్‌పర్సన్ తోటి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లుతో కలసి సందర్శించి సంఘీభావం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో ఉద్యోగులు, కార్మికుల పాత్ర కీలకమన్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న ఆందోళనలో న్యాయముందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించి వేతనాలు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సిర్రా కాంతమ్మ, యర్రా ఉమ, పతివాడ పద్మ, చిట్టూరి పద్మ, ద్వారా గంగాభవానీ, జిల్లెళ్ల దిలీప్, సఖినేటిపల్లి సురేష్, మల్లాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: స్థానిక ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నరసయ్య అగ్రహారంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

విద్యుత్ లోడును క్రమబద్ధీకరించుకోవాలి

యలమంచిలి: విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ లోడును క్రమబద్ధీకరించుకోవడానికి రెండు రోజులు మాత్రమే గడువుందని ఎలక్ట్రికల్ ఏఈ మురళీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేవారు. వినియోగదారులంతా పూర్వం విద్యుత్ కనెక్షన్ తీసుకున్న సమయంలో తీసుకున్న లోడునే ఇప్పటికీ వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ప్రతి ఇంటిలో విద్యుత్ వినియోగం పెరిగిందని, ఆ మేరకు విద్యుత్ లోడును పెంచుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ నెల 30వ తేదీ వరకు 50 శాతం సబ్సిడీతో లోడు పెంచుకోవడానికి గడువుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విద్యుత్‌శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.